'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

### నమస్తే తెలంగాణ

# జుమ్లా హామీలు

మాట ఇచ్చి తప్పడమనేది బీజేపీకి సర్వసాధారణమైపోయింది. తొమ్మిదేండ్ల కిందట నరేంద్ర మోదీని ముందు పెట్టుకొని పార్ల మెంటు ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు ఆ పార్టీ ఎన్నెన్నో హామీలి చ్చింది. 'అచ్చే దిన్' అన్నారు. స్విస్ బ్యాంకులోంచి నల్లధనం తెచ్చి ఖాతాల్లో పోస్తామన్నారు. యువత పదేండ్ల కాంగ్రెస్ పాలనలో ఉసూరుమంటున్నదని తెగ జాలిపడిపోయారు. దేశంలో యువజ నుల సంఖ్య పెరిగిపోయిందని, ఇది దేశానికి శుభసూచకమన్నారు. వారికి ఉద్యోగాలు కల్పిస్తే దేశం అభివృద్ధిలో అంగలు వేస్తుందని ఊరించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ ఉద్యోగాలు ఇస్తామన్నారు. మోదీ తొమ్మిదేండ్ల పాలన తర్వాత ఇప్పుడు పరిస్థితి చూస్తే నానాటికి తీసి కట్టు అన్నట్టుగా తయారైంది.

దేశంలో ఉపాధి పెరగడం మాట అటుంచితే నిరుద్యోగం ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయింది. ముఖ్యంగా కరోనా సమయంలో మోదీ సర్కారు అనుసరించిన అనాలోచిత నిర్ణయాల ఫలితంగా ఉద్యోగాలు పోయి యువత రోడ్డునపడ్డారు. 2022లో భారత్ యువజన నిరుద్యోగిత రేటు (23.22 శాతం) ఇరుగు పొరుగు దేశాల కన్నా చాలా ఎక్కువగా ఉండటం గమనార్హం. ప్రపంచ బ్యాంకు తాజాగా వెల్లడించిన గణాంకాలు ఈ సంగతిని స్పష్టం చేస్తున్నాయి. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్ నిరుద్యోగిత రేటు 11.3 శాతం ఉండటం మనకు సిగ్గుచేటు. బంగ్లాదేశ్(12.9 శాతం), భూటాన్ (14.4 శాతం) పరిస్థితి మన కన్నా మెరుగ్గా ఉండటం గుర్తించదగ్గ అంశం. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) డాటా ఆధారంగా ఈ నివేదిక రూపొందింది. 15-24 ఏండ్ల యువత ఈ నిరుద్యోగిత పరిధిలోకి వస్తారు. బీజేపీ ఎక్కువగా ఆశలు కల్పించింది ఈ వయోవర్గం వారికే అనేది ఇక్కడ గుర్తుంచుకోవాలి. చదువులు పూర్తిచేసుకొని కోటి ఆశలతో ఉద్యోగాల వేటలో పడే వీరికి నిరాశామయమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఎంట్రీ లెవల్ ఉద్యోగాల కల్పనలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఇది సూచిస్తున్నది.

2021-22లో 25 ఏండ్ల లోపు గ్రాడ్యుయేట్లు 42 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారని 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా-2023' నివేదిక తెలియజేసింది. వేతనాలు ఆశించిన స్థాయిలో ఉండకపోవడం కూడా సమస్యేనని పేర్కొనడం గమనార్హం. ఇదే కాలవ్యవధిలో స్వయం ఉపాధిని ఎంచుకునే మహిళల సంఖ్య 50 నుంచి 60 శాతానికి పెరిగింది. అంటే ఉద్యోగాల కన్నా స్వయం ఉపాధే నయమనుకునేవారు పెరిగారన్న మాట. దేశ ఆర్థికవృద్ధి ఉద్యోగాలు కల్పించలేకపోతున్నదని ఆర్థిక నిపుణులు అంటున్నారు. జీడీపీ పెరుగుతున్న కొద్దీ ఉపాధి అవకాశాలు తగ్గిపోయే విచిత్ర పరిస్థితి దేశంలో నెలకొన్నది. సకలజనుల బాగుకోసం కాకుండా పిడికెడు మంది మేలు కోసం అనుసరిస్తున్న మోదీ సర్కారు విధానాలే ఇందుకు కారణమని చెప్పవచ్చు. బీజేపీ ఉద్యోగ హామీలు మొత్తం మీద ఎన్నికల జుమ్లా వలె మిగిలిపోయాయి.

# ఇంటింటా సంక్షేమాల పంట



గోసుల శ్రీనివాస్ యాదవ్
98498 16817



> తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాను ఎంతో ముందుగా ప్రకటించడమే కాకుండా, స్వయంగా ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. మరోవైపు ప్రతిపక్షాలు కూడా తమ అభ్యర్థుల జాబితాను విడుదల చేసే పనిలో ఉన్నాయి. కేసీఆర్ ప్రచారానికి, ప్రతిపక్షాల ఆర్భాటానికి తేడా స్పష్టంగా కనిపిస్తున్నది.

కేసీఆర్ పరిపాలనా సరళిలో, ప్రచారం తీరులో ఎంతో స్పష్టత ఉన్నది. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రచారంలో డొల్లతనం కనిపిస్తున్నది. ఇటీవలి ఎన్నికల హామీలు ఇందుకు ఒక ఉదాహరణ. తెలంగాణ సమాజం పట్ల, అవసరాల పట్ల ప్రతిపక్షాలకు అవగాహన లేకపోవడమే ప్రతిపక్షాల భావదారిద్ర్యానికి కారణం.

బీజేపీ, కాంగ్రెస్‌లకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమిటి? ప్రజల అవసరాలు ఏమిటి? ఏ పథకం ఎందుకు ఇవ్వాలనే ఆలోచనే రాదు. వాస్తవానికి కేసీఆర్ తెలంగాణ ప్రజల ఆకలి దప్పులను ఇప్పటికే తీర్చివేశారు. తెలంగాణ ఆ దుస్థితిని ఎప్పుడో అధిగమించింది. ఇప్పుడు కేసీఆర్ ఆలోచనలు తెలంగాణను ఇంతకుమించి ఏ విధంగా అభివృద్ధి చేయాలనే స్థాయిలో ఉన్నాయి. కేసీఆర్ ఆలోచనలు ఎన్నికల కోసమే పరిమితమయ్యేవి కాదు. అదే కేసీఆర్‌కు ఇతర పార్టీల నాయకులకు తేడా. అందుకే కాంగ్రెస్, బీజేపీలకు చెందిన రాష్ట్ర నాయకులు, దేశ నాయకులు ఎవరూ కేసీఆర్‌కు సరితూగలేరు. దీనికి కారణం ఎన్నికల రాజకీయం చుట్టూ కేసీఆర్ తిరుగుతూ ఉండరు. విస్తృతంగా ప్రజా సంక్షేమం కోసం ఆలోచిస్తుంటారు.

కేసీఆర్ ఒక విజనరీ. తెలంగాణ సర్వతోముఖాభివృద్ధి చెందడమనేది ఆయన స్వప్నం. ఆయన అహర్నిశలు తెలంగాణ సమాజం కోసం తపిస్తూ ఉంటారు. తెలంగాణ సమగ్ర దర్శనంలో భాగంగా ఆయన మనసులో అనేక వ్యూహాలు రూపుదిద్దుకుంటూ ఉంటాయి. ఆ అభివృద్ధి వ్యూహాల్లో భాగంగానే దార్శనికుడైన కేసీఆర్ అనేక పథకాలకు రూపకల్పన చేస్తుంటారు. మనకు బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టో కనిపిస్తుంది. కేసీఆర్ చెప్పే కొన్ని హామీలు కనిపిస్తాయి. కానీ వాటివెనుక కేసీఆర్ సమగ్రాభివృద్ధి వ్యూహాలు ఉన్నాయనే గొప్ప విషయం చాలామందికి తెలియనిది. కేసీఆర్ అభివృద్ధి వ్యూహంలో ఎన్నికల హామీలు చాలా స్వల్పమైనవి.

ఎన్నికల హామీలకే కేసీఆర్ హామీలు, పరిపాలన, ఆలోచన పరిమితం కాదు. ఎన్నికల మ్యానిఫెస్టోలో లేని అనేక పథకాలను కేసీఆర్ తన పరిపాలనా క్రమంలో అమలు చేయడాన్ని మనం గమనించవచ్చు. ఉదాహరణకు రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి- షాదీ ముబారక్, కేసీఆర్ కిట్, బతుకమ్మ చీరలు, దళితబంధు, బీసీ బంధు మొదలైనవేవీ ఎన్నికల హామీలు కాదు. ఇటీవల ఎరుకల సాధికారత పథకంగా పందుల పెంపకం ప్రకటించారు. ఆయా సామాజికవర్గాల అవసరాన్ని గుర్తించి ప్రకటించే పథకాలు ఇవి. వీటికి ఎన్నికలకు సంబంధం లేదు. హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యం పెట్టడం కూడా వారు కడుపు నిండా తినాలనే ఉద్దేశంతోనే. ఇది కేసీఆర్ మానవీయ ఆలోచనలకు ప్రతిబింబం. ఇటువంటివి ఎన్నికల హామీలు కానవసరం లేదు. కరోనా కాలంలో వడ్లు కొనాలనే ఆలోచన కేసీఆర్ వంటి నాయకులకే వస్తుం ది. ఇవన్నీ సమాజ హితం కోరుకునే ఏ పాలకుడైనా చేయవలసిన కనీస ధర్మాలు.

కేసీఆర్ విడుదల చేసిన మ్యానిఫెస్టోలో 'ఇంటింటికీ బీమా- కేసీఆర్ ధీమా' కొత్తది. దీనివల్ల బీపీఎల్ కుటుంబాలకు ఐదు లక్షల బీమా వర్తిస్తుంది. క్రమపద్ధతిలో ఆసరా పింఛన్ నెలకు ఐదు వేలకు పెంచాలని నిర్ణయించారు. రైతుబంధు 16 వేలకు పెంచుతున్నారు. ఆరోగ్య బీమా పరిమితిని 5 లక్షల నుంచి 15 లక్షలకు పెంచుతున్నారు. పేద మహిళల కోసం సౌభాగ్య లక్ష్మి పథకం ద్వారా నెలకు మూడు వేలు అందించాలని భావిస్తున్నారు. గ్యాస్ సిలిండర్‌ను పేదలకు రూ.400కే ఇస్తామని ప్రకటించారు. అగ్రవర్ణపేదల పిల్లల కోసం నియోజకవర్గానికి ఒక గురుకులం ఏర్పాటుచేస్తామని చెప్పారు. మైనారిటీ గురుకులాలను డిగ్రీ కళాశాలలుగా ఉన్నతీకరిస్తామని కూడా కేసీఆర్ ప్రకటించారు. ఇవన్నీ ఎన్నికల గెలుపు కోసం హడావుడిగా రూపొందించిన పథకాలు కావు. ఏటా సమాజ ఎదుగుదలను, అవసరాలను సమీక్షిస్తూ, ఆర్థిక పరిస్థితులను బేరీజు వేసుకుంటూ కేసీఆర్ ఆయా పథకాలను ప్రవేశ పెడుతూ ఉంటారు.

> మనం కేసీఆర్ దార్శనికతను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. ఈ దార్శనిక నాయకుడు ఒక పద్ధతి ప్రకారం సమాజాన్ని ఏ విధంగా అభివృద్ధి పథంలో నడిపించుకుపోతున్నారనేది అర్థం చేసుకోవాలి. ఆడబిడ్డ నల్లా ముందు బిందె పట్టుకొని నిలబడే కష్టం పోవాలన్న ఆలోచనతో ఇంటింటికీ నీళ్లు వస్తున్నాయి. ఇదేవిధంగా చెరువులు నిండాయి. గోదావరి జలాలు బీడులను పచ్చని పొలాలుగా మార్చాయి. అణగారిన వారి పిల్లలు గురుకులాలలో కార్పొరేట్ స్థాయి విద్య పొందుతున్నారు. ఇవన్నీ మన ముందు ఏకరువు పెట్టలేదు. కానీ అమలుచేసి చూపిస్తున్నారు.

ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. అటవీ విస్తీర్ణం పెరిగింది. మానవాళి సంక్షేమానికి భరోసా లభిస్తున్నది. ఇదంతా ఒకప్పుడు కేసీఆర్ కలగన్నారు. నా తెలంగాణ ఇంత గొప్పగా ఉండాలని ఆకాంక్షించారు. ఆ ఆకాంక్షను, ఆ స్వప్నాన్ని సాకారం చేసుకున్న తృప్తి ఆయనకు లభించింది. కేసీఆర్ భవిష్యత్తు వ్యూహాలు చాలా సమగ్రంగా ఉంటాయి. అందులోంచి కొత్త కొత్త పథకాలు, విధానాలు వస్తుంటాయి. రాష్ట్రంలో అనేక వైద్య కళాశాలలు ప్రారంభించారు. భవిష్యత్తులో ఏటా వేలాది మంది వైద్యులు అందుబాటులోకి వస్తారు. ఇదేవిధంగా గురుకులాలు అనేకమంది ప్రతిభాశాలులను తయారుచేస్తున్నాయి. భవిష్యత్తులో భావి భారతాన్ని పాలించేది, నడిపించేది ఈ బాలలే.

రాజకీయ నాయకుడు రాబోయే ఎన్నికల కోసం ఆలోచిస్తాడు. పాలనాదక్షుడు రాబోయేతరాల గురించి ఆలోచిస్తాడు. కేసీఆర్ సాధారణ నాయకుడు కాదు, దార్శనికుడు, పరిపాలనాదక్షుడు. ఆయన రాబోయే తరాల కోసం అన్ని రంగాలను తీర్చిదిద్దుతున్నారు. ఆయన అధికారంలో ఉంటే అద్భుతాలను సృష్టిస్తూనే ఉంటారు. కేసీఆర్ మహోన్నత నాయకుడు. ప్రజల దృష్టిలో కేసీఆర్ మాత్రమే నాయకుడు, ముఖ్యమంత్రి పీఠానికి విలువ తేగల నిజమైన పాలనాదక్షుడు.

(వ్యాసకర్త: డైరెక్టర్, టీ కేసీఆర్ సెంటర్)



## తెలంగాణ జీవధార

> దక్కన్ పీఠభూమిలో సగటు వర్షపాతం కేవలం 90 సెంటీమీటర్ల మేరకే ఉన్నా తెలంగాణలో నీటివనరుల సంరక్షణ వినియోగంలో ఒక ఆదర్శ నమూనాను కేసీఆర్ ప్రపంచానికి పరిచయం చేశారు. ఉష్ణమండల శుష్కప్రాంతంగా ఉన్న తెలంగాణ మాగాణం ఆకుపచ్చని చీరను ఎలా నేసిందో అనుభవంలోకి తీసుకువచ్చారు. సంక్షుభిత తెలంగాణ వ్యవసాయాన్ని విరామం, విశ్రాంతి ఎరగని కృషి ద్వారా సుభిక్షంగా మార్చిన తీరు ఒక ఇతిహాసం.



అస్నాల మైత్రేయ

రాజకీయుడు రేపటిని గురించి మాత్రమే ఆలోచిస్తాడు. కానీ ప్రజాపాలకుడు, రాజనీతిజ్ఞుడు రేపటి తరాన్ని గురించి ఆలోచిస్తాడు. భూగర్భ జల వనరుల శాఖ, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ సంయుక్తంగా చేపట్టిన సర్వే తెలంగాణ భూగర్భంలో నీటి మట్టాలు నాలుగు మీటర్ల మేరకు పెరిగాయని తెలియజేసింది. ఈ సంస్థలు విడుదల చేసిన 2023 నివేదికలో అబ్బురపరిచే అంశాలున్నాయి. 2013లో 472 టీఎంసీలుగా ఉన్న భూగర్భ జలాలు 2023 నాటికి 739 టీఎంసీలకు పెరిగాయి. సాగు కోసం భూగర్భ జలాల వెలికితీత 58 శాతం నుంచి నుంచి 39 శాతానికి తగ్గిందని పేర్కొన్నది. తెలంగాణ భూగర్భంలో దాదాపు రెండు నాగార్జునసాగర్ ప్రాజెక్టులతో సమానమైన జలసిరి నిక్షిప్తమై ఉన్నదని తెలియజేసింది. గత పదేండ్లుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న బహుముఖ కృషి ఫలితంగా నీటిమట్టాలు పెరిగాయి. మిషన్ కాకతీయ ద్వారా 27 వేలకు పైగా చెరువులు పునరుద్ధరించారు. కాళేశ్వరం ఎత్తిపోతల ద్వారా గోదావరి నీటిని భారీ మధ్యతరహా ప్రాజెక్టులను అనుసంధానించారు. చెరువులను నింపడం, చెక్ డ్యాంలను కట్టడం వేలాది ఇంకుడు గుంతలు తవ్వించడం ద్వారా ఇది సాధ్యమైందని కేంద్ర జల మంత్రిత్వశాఖ తెలియజేసింది. తెలంగాణలో హరితహారం ప్రభావం వల్ల వార్షిక సగటు కంటే ఎక్కువగా వర్షపాతం నమోదవుతున్నది.

కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల పథకాలతో నీరు సహజంగా ఉబికివచ్చే బుగ్గబావుల నెలవుగా మారింది. 18 జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. నైరుతి రుతుపవనాల కాలంలో 2022లో 110 సెంటీమీటర్లు, 2023లో 86 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇది సాధారణ వర్షపాతమైన 74.4 సెంటీమీటర్ల కంటే ఎక్కువే. వ్యవసాయరంగం మీద ఆధారపడిన 75 శాతం మంది ప్రజల్లో 85 శాతం మంది చిన్న, సన్నకారు రైతులే. 2014కు ముందు వీరు తిండి అవసరాల కంటే తక్కువ ఉత్పత్తి చేసేవారు. 2021-22లో తెలంగాణ 88 లక్షల టన్నుల ధాన్యాన్ని ఉత్పత్తి చేసింది. దీనిలో 93 శాతం వాటా సన్నకారు రైతులదే. అలాగే పంటల సాగు 131 లక్షల ఎకరాల నుంచి 238 లక్షల ఎకరాలకు పెరిగింది. పంట ఉత్పత్తి 145 శాతం పెరిగింది. గత తొమ్మిదేండ్ల కాలంలో ధాన్యాల, విత్తనాల ఉత్పత్తిలో అతివేగంగా తెలంగాణ పురోగమించింది. ఇదే క్రమంలో సమాంతరంగా నీటిపై ఒత్తిడిని కలిగించే పంటల స్థానంలో భూముల స్వభావం, వాతావరణం, సాగునీటి పరిమితుల ఆధారంగా బహుళ పంటల సమీకృత వ్యవసాయ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆచరణలోకి తెచ్చింది. ఎల్‌నినో, లానినోల ప్రభావం వల్ల కలుగుతున్న వాతావరణ మార్పులతో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు తరచుగా కలుగుతున్న ఈ కాలంలో నీటి వనరులను పొదుపుగా వినియోగించే పద్ధతులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది.

> ధరల పెరుగుదలలో వినియోగదారుల, స్థూల టోకు ధరల సూచీని ప్రభావితం చేసే కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు తదితర పంటల సాగుకు అపరిమితమైన సబ్సిడీతో కూడిన ప్రోత్సాహాన్ని తెలంగాణ ఇస్తున్నది. ఆహారశుద్ధి యూనిట్లను స్థాపిస్తున్నది. భూసార పరీక్షలను జరిపిస్తూ, సేంద్రియ ఎరువుల వాడకాన్ని విస్తరిస్తున్నది. మన లాంటి భౌగోళిక, నైసర్గిక స్వరూపం ఉన్న పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ల్లో నీటి యాజమాన్య సంరక్షణ విధానాలు లేని కారణంగా కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి.

కర్ణాటకలో 13 జిల్లాలు కరువు బారిన పడ్డాయి. కరువు నేలలో దుఃఖమయమైన రైతు జీవితాల్లో వెలుగులు తేవాలన్న లక్ష్యంతో గొప్ప విప్లవ వెల్లువను సృష్టించిన శక్తి కేసీఆర్. నీటికి నడకనే కాదు నర్తనమే నేర్పిస్తున్నారు. కేసీఆర్ అసమాన కార్యదీక్ష కొనసాగేందుకు ఐక్యంగా అందరం ఆయన వెంట నిలువడమే మనం నిర్వర్తించాల్సిన చారిత్రక బాధ్యత.

(వ్యాసకర్త: దొడ్డి కొమురయ్య ఫౌండేషన్ సభ్యుడు)

# సుస్థిర ప్రగతికి సువర్ణావకాశం



డాక్టర్ మాగంటి శేషుమాధవ్

> ఔను ఇప్పుడు మనందరి మదిలో మాట, తెలంగాణ ముచ్చట ఒక్కటే.. కేసీఆర్ సార్ మూడోసారి ముఖ్యమంత్రి కావలసిన చారిత్రాత్మక అవసరం ఏమిటి? తెలంగాణ తొలి ఉద్యమం జరిగినప్పుడు నేను ఏడాది పోరన్ని. మలిదశ ఉద్యమంలో పోరాటాల గడ్డ వరంగల్‌లో పిల్లల డాక్టర్‌గా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడినిగా, మెడికల్ జేఏసీ ఆవిర్భావ ముఖ్య నాయకుల్లో ఒకడిని. కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణ సాధనలో నేను సైతం అంటూ నడిచినవాడిని...



అమరవీరుల త్యాగాల సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నా జీవిత పుటల్లో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది. తెచ్చిన తెలంగాణకు దశా దిశ ఒక్క కేసీఆర్‌తోనే సాధ్యమని గట్టిగా నమ్మినవాళ్లలో నేనూ ఒక్కడిని. అనుకున్నట్టుగానే ప్రజల ఆశీర్వాదంతో కేసీఆర్ తెలంగాణకు తొలి ముఖ్యమంత్రి అయ్యారు. తిరుగులేని సంక్షేమ పథకాలు, అభివృద్ధి, దూరదృష్టితో 2014 కంటే ఎక్కువ మంది ప్రజల ఆశీర్వాదంతో రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు.

రాష్ట్ర ఆవిర్భావం నుంచి 360 డిగ్రీల ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్‌తో ప్రపంచపటంలో 'మోస్ట్ హ్యాపెనింగ్ స్టేట్'గా తెలంగాణను నిలిపారు. ఈ తరుణంలో ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండవలసిన అవసరం, అనివార్యత తెలంగాణకు ఉన్నది. ముఖ్యంగా సుస్థిరత, ఒక నిర్దేశించిన దిశలో పాలన సాగుతున్నప్పుడు మళ్లీ ఆయననే ముఖ్యమంత్రిగా కోరుకోవటం సరైనదే కదా?

నిరంతర విద్యుత్తు, తాగునీరు, సాగునీరు, సంక్షేమం, విద్య, వైద్యం, ఆసరా, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, రైతుబంధు, దళితబంధు వంటి ఎన్నో ఫ్లాగ్‌షిప్ పథకాల అమలుతో తెలంగాణ రాష్ట్రం అంతర్జాతీయంగా, జాతీయస్థాయిలో ఒక సుస్థిరమైన అభివృద్ధిని సాధించిన రాష్ట్రంగా పేరు గడించింది. సుస్థిర, సమగ్రాభివృద్ధిని కొనసాగిస్తూ మరింత విస్తృత స్థాయిలో దీన్ని ముందుకు తీసుకుపోవాలంటే మన కేసీఆర్ తెలంగాణ రాష్ట్రానికి మూడోసారి ముఖ్యమంత్రిగా ఉండాల్సిన ఆవశ్యకత, అవసరం ఎంతైనా ఉన్నది. తెగువతో పాటు స్పృహ ఉన్న తెలంగాణ ప్రజలకు ఇవన్నీ తెలుసు.


కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన విధానాలతో మాతాశిశు సంక్షరణ (ఎన్ఎంఆర్, ఎంఎంఆర్)లో తెలంగాణ దేశంలోనే ఉత్తమస్థాయిలో నిలుస్తున్నది. ఈ రెండు విభాగాల్లోనూ తెలంగాణ రాష్ట్రం జాతీయస్థాయిలో మూడోస్థానంలో ఉన్నది. ఐక్యరాజ్యసమితి రూపొందించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు (ఎస్డీజీ) ప్రమాణాల ప్రకారమే తెలంగాణ మాతాశిశు వైద్యంలో ఉత్తమంగా ఉంటున్నది. 2015లో నవజాతశిశు మరణాల రేటు 34 ఉంటే ఇప్పుడది 21కి తగ్గింది. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలుచేస్తున్న కేసీఆర్ కిట్ పథకంతో మహిళా, శిశు ఆరోగ్య సంరక్షణలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. గ్లోబల్ హెల్త్ ఇండెక్స్‌లో తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా నిలిచింది. కాన్పులు వందకు వందశాతం దవాఖానాల్లోనే జరుగుతున్నాయి. వీటిలో 80 శాతం ప్రభుత్వ దవాఖానాల్లోనే, అవీ సాధారణ కాన్పులు జరుగుతున్నాయి. ఇదీ కేసీఆర్ కిట్ ఘనత. సమగ్ర, సుస్థిరాభివృద్ధి (360 డిగ్రీల) అంటే ఇదే మరి.

ఒక సామాజిక ఇంజినీర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఇలాంటి సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుంది. వైద్య సంస్కరణల్లో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ వైద్య విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. ప్రతి జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ అనేది విప్లవాత్మక విధానం. 1986లో నేను ఎంబీబీఎస్‌లో జాయిన్ అయినప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆరు ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, ఒక ప్రైవేటు మెడికల్ కాలేజీ ఉండేది. అప్పుడు తెలంగాణ ప్రాంతంలో మూడు మాత్రమే ఉండేవి. ఇప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశారు. కాలేజీకి అనుబంధంగా కనీసం 300 పడకల నుంచి 500 పడకల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను నిర్మిస్తున్నారు. ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా పేదలకు మెరుగైన, నాణ్యమైన వైద్యం వారికి దగ్గర్లోనే ఉచితంగా అందుతున్నది. వైద్యం, విద్యతో పాటు ఒక హెల్త్ సెంటర్ ఫైనాన్షియల్ డెవలప్‌మెంట్ ప్రతి జిల్లాలకు దోహదపడుతున్నది. ఆరోగ్యమే మహా భాగ్యం అనేది ఎప్పటికీ వాస్తవమైన మాట. నాణ్యమైన, ఆధునిక అల్లోపతి వైద్యం పేదలకు అందుబాటులోకి రావడంతో వారి ఆరోగ్య స్థితితోపాటు వైద్యానికి చేసే ఖర్చులు మిగిలి వారి ఆర్థిక ప్రమాణాలు పెరుగుతాయి. ఇలాంటి ఆలోచన చేసి, దాన్ని వేగంగా అమలుచేసిన కేసీఆర్ ఒక రెవల్యూషనరీ సోషల్ సైంటిస్ట్.

> ఏటా వెయ్యి మంది క్వాలిఫైడ్, ఎంబీబీఎస్ డాక్టర్లు ప్రజల ఆరోగ్యసేవలకు అంకితమవుతున్నారు. ఇది నిజంగా వైట్ కోట్ రెవెల్యూషన్. దీనివెనుక పింక్ హార్ట్ కేసీఆర్ పట్టుదల ఉన్నది. అందుకే మళ్లీ మన కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలి. వేరే ఎవ్వరు వచ్చినా మంద మీద తోడేలు పడ్డట్టే అయితది. వంద, నూటాయాభై స్పీడులో క్రూయిజ్ కంట్రోల్ మోడ్‌లో పోతున్న తెలంగాణ సమగ్ర, సుస్థిర ప్రగతికి స్పీడ్ బ్రేక్ పడ్డట్టయితది. అప్పుడు సున్నా నుంచి మళ్లీ మొదలు కావాల్సిందే.

అందుకే తెలంగాణ ప్రజలకు ఎలాంటి అనుమానం అవసరం లేదు. మనకు కేసీఆరే దిక్సూచి. ఆయనే మనకు శ్రీ రామరక్ష. కేసీఆర్ గ్లోబల్ థింకింగ్‌తో లోకల్ డెవలప్‌మెంట్ చేసి చూపించారు. పొరపాటున వేరే ఎవరైనా వస్తే వాళ్లు ఢిల్లీ, గల్లీ థింకింగ్‌తో మన తెలంగాణను నాన్‌లోకల్ డెవలప్ మెంట్‌గా చేస్తారు. తెలంగాణ ప్రగతిని నిరాటంకంగా కొనసాగించేందుకు ఉద్యమస్ఫూర్తితో మనమందరం మళ్లీ కేసీఆర్‌ను ఆశీర్వదించాలె. తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపిన కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలె. తెలంగాణ రాష్ట్ర సాధన కలను పూర్తిగా సాకారం చేసుకోవాలె.

(వ్యాసకర్త: తెలంగాణ మెడికల్ కౌన్సిల్ మెంబర్)




## ఇజ్రాయెల్ ప్రతీకారం ఓ విషాదం

> హమాస్ దాడులకు ప్రతీకారంగా పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ ఘోరంగా విరుచుకుపడటం ఏ మాత్రం సమర్థనీయం కాదు. నాజీల నరమేధం నుంచి పుట్టుకువచ్చిన ఇజ్రాయెల్ ఇలాంటి ఘోరాలకు పాల్పడటం ఓ విషాదం.

- అంటోని గుటేరస్
ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి

